క్లుప్తంగా

నేటినుంచి పింఛన్ల పంపిణీ

జంగారెడ్డిగూడెం: పట్టణ పురపాలక సంఘం పరిధిలో బుధవారం ఈనెల 5వ తేదీ వరకు పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.నరేంద్రకుమార్ తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలోని 10 సచివాలయలకు సంభందించి మొత్తం 4,971 మంది లబ్ధిదారులకు రూ.1,50,25,000 పింఛను నగదు అందించడం జరుగుతుందన్నారు. ఇందులో 3,933 మంది పింఛను లబ్ధిదారులకు (డీబీటీ) డైరెక్ట్ బెనిఫిషరీ ట్రాన్స్‌ఫర్ పద్ధతి ద్వారా నేరుగా లబ్ధిదారుల ఆధార్‌కు లింక్ అయిన బ్యాంకు అకౌంట్‌లలో రూ.1,17,99,000 జమచేయబడుతుందన్నారు. హెల్త్ పింఛన్లు, పెరాలసిస్ పింఛన్లు, కొందరు వృద్ధులకు, మరికొన్ని రకాల పింఛన్లను కలుపుకుని మొత్తం 1,038 మంది పింఛన్ల లబ్ధిదారులకు ఇంటింటికి సచివాలయాల సెక్రెటరీల ద్వారా రూ.32,26,000 పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. డీబీటీ పద్ధతి ద్వారా నగదు జమకాబడిన వారి వివరాలు 2వ తేదీ నుంచి సచివాలయాల్లో అందుబాటులో ఉంటాయన్నారు. పింఛనుదారులకు సచివాలయ సెక్రెటరీల ద్వారా తెలియజేయడం జరుగుతుందన్నారు. కావున పింఛను తీసుకునే లబ్ధిదారులు ఎవ్వరూ సచివాలయాలకు రావాల్సిన అవసరం లేదని, ఈ విషయాన్ని గమనించి ఇబ్బందులు పడకుండా మీకు వెసులుబాటు అయినప్పుడు బ్యాంకు ద్వారా పింఛన్లను పొందాలని కమిషనర్ కోరారు.

వలంటీర్ల రాజీనామా


మున్సిపల్ కమిషనర్ నరేంద్రకుమార్‌కు రాజీనామా పత్రాలను అందజేస్తున్న వలంటీర్లు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ పరిధిలో 38 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఈ మేరకు వలంటీర్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.నరేంద్రకుమార్‌కు తమ రాజీనామ పత్రాలను అందజేశారు. నిస్వార్థంగా సేవలందిస్తున్న తమపై చంద్రబాబు అసంబద్ధంగా మాట్లాడుతున్నారని, అందుకే రాజీనామా చేసినట్లు చెప్పారు. ఇకపై తాము సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విజయానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

పరామర్శ

బుట్టాయగూడెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ గద్దే వీరకృష్ణ కుటుంబ సభ్యులను ఆ పార్టీ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి పరామర్శించారు. వీరకృష్ణ తల్లి, భార్యల ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. 2019 ఎన్నికల్లో పార్టీ గెలుపునకు వీరకృష్ణ చేసిన కృషి మరచిపోలేనిదన్నారు. వీరకృష్ణ మరణం పార్టీకి తీరని నష్టం కలిగించిందని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు అన్ని వేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

అన్నప్రసాద వితరణ

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుందర బాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం అన్నప్రసాద వితరణ చేశారు. 1500 మంది భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించినట్లు కమిటీ అధ్యక్షుడు కానూరి గంగాధరరావు, సభ్యులు చెప్పారు. దాతలుగా అత్యం సత్యప్రసాద్, నాగ వెంకట సత్య ముకుంద దంపతులు సహకరించారని తెలిపారు.

ఘనంగా శ్రీశ్రీ జయంతి

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం శ్రీరంగం శ్రీనివాసరావు జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మహాకవి శ్రీశ్రీ తెలుగు సాహిత్యానికి చేసిన సేవలను వివరించారు. మహాప్రస్థానంలోని వివిధ రకాల కవితలను చదివి వినిపించారు. అనంతరం మహాప్రస్థానం కవితా సంపుటిని విద్యార్థులకు పంపిణీ చేశారు.

మేడేను జయప్రదం చేయండి

కుక్కునూరు: కార్మికుల పండుగ దినం మేడేను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ పిలుపునిచ్చారు. మంగళవారం సలీం పాషా అధ్యక్షతన జరిగిన భగత్‌సింగ్ భవన నిర్మాణ కార్మికుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు సాధించిన విజయానికి ప్రతీకగా నిర్వహించే మేడే ఉత్సవాలల్లో కార్మికులంతా అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. సమావేశంలో సీఐటీయూ మండల సహాయ కార్యదర్శి తిరోజుల సురేష్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు పరిటాల సతీష్, హుస్సేన్, హరి, వలీపాషా తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను ఓడించాలి

కుక్కునూరు: రాష్ట్రంలో బీజేపీ మద్దతుతో పోటీచేస్తున్న టీడీపీ, జనసేన పార్టీలను ఓడించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం ఆ పార్టీ డివిజన్ కమిటీ అధ్వర్యంలో లచ్చిగూడెంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. డివిజన్ కార్యదర్శి ఎస్‌కే గౌస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కేంద్ర కమిటీ నాయకుడు కెచ్చల రంగారెడ్డి, గోకేనేపల్లి వెంకటేశ్వరావు హాజరై మాట్లాడారు. కేంద్రంలో పదేళ్లపాటు అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసిందని విమర్శించారు. మోదీకి మూడోసారి అధికారం ఇస్తే భారత రాజ్యాంగాన్ని మార్చి మనుధర్మ రాజ్యాంగాన్ని తీసుకువస్తారని, అందుకే రాష్ట్రంలో కూడా ఆ పార్టీ మద్దతుతో పోటీచేస్తున్న కూటమి అభ్యర్థులను ఓడించాలన్నారు.

ఆధ్యాత్మిక క్షేత్రం

రాష్ట్రంలోనే పేరు గాంచిన హనుమాన్ క్షేత్రం.. జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం గ్రామంలో శ్రీమద్ది ఆంజనేయస్వామి దేవస్థానం. మద్ది చెట్టు తొర్రలో స్వామి వారు స్వయంభువుగా వెలవడంతో ఈ ఆలయానికి శిఖరం ఉండదు. మద్ది చెట్టు కింద స్వామి వారు వెలవడంతో మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంగా పేరు వచ్చింది. హనుమాన్ దీక్షలు, 108 ప్రదక్షిణలకు ఇక్కడ అధిక ప్రాముఖ్యత ఉంది. సినీ, రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులు స్వామివారి దర్శనానికి ఎక్కువగా వస్తుంటారు.


జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెంలో వెలసిన ప్రసిద్ధ మద్ది ఆంజనేయ స్వామి ఆలయం

మధ్యతరహా ప్రాజెక్టు

ఏలూరు జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టు అయిన జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం శ్రీకరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయంపై మెట్ట ప్రాంత రైతులు ఆధారపడి పంటలు పండిస్తుంటారు. డ్యాం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 83.50 మీటర్లు. కుడి, ఎడమ కాలువల ద్వారా రబీ, ఖరీఫ్ సీజన్‌లో 15వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తుంటారు. సంవత్సరంలో 365 రోజులు జలాశయంలో నీరు నిల్వలు ఉంటాయి.


జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం శ్రీకరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయం

తమ్మిలేరు రిజర్వాయరు

చింతలపూడి మండలం, నాగిరెడ్డిగూడెం సమీపంలో తమ్మిలేరు రిజర్వాయరు ఉంది. ప్రాజెక్టు కింద అధికారికంగా 9,169 ఎకరాల ఆయకట్టు సాగవుతుంది. అనధికారికంగా ఏటి కాల్వల ద్వారా 20 వేల ఎకరాలు సాగు చేస్తున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 355 అడుగులు.

- సంక్రాంతి సమయంలో మూడు రోజులపాటు కోడి పందేలు భారీగా జరుపుతారు. డెల్టా తరువాత అంత భారీస్థాయిలో పందేలు నిర్వహించడం ఇక్కడే. కోట్లాది రూపాయలు చేతులు మారతాయి.


చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం సమీపంలో రైతులకు సాగునీరు అందిస్తున్న తమ్మిలేరు ప్రాజెక్టు

ప్రపంచ ప్రసిద్ధిగాంచిన బౌద్ధాలయాలు నియోజకవర్గంలోని కామవరపుకోట మండలం జీలకర్రగూడెం గ్రామంలో ఉన్నాయి. ఇది పాండవులు నివశించిన ప్రాంతంగా చరిత్రకారులు చెప్తుంటారు. కార్తీక మాసంలో ధర్మలింగేశ్వరస్వామిని దర్శించుకోవడానికి రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు వస్తుంటారు. ఇతర దేశాల నుంచి ఏటా బౌద్ధ భిక్షువులు సందర్శించి వెళతారు. అబ్బుర పరిచే కట్టడాలు ఇక్కడ విశేషం. ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా ప్రభుత్వం గుర్తించింది.



చారిత్రక ఆనవాళ్లకు నెలవు

- సుదీర్ఘకాలం రెడ్డిరాజులు పాలించిన ప్రాంతం
- పర్యాటక ప్రాంతంగా జీలకర్రగూడెం బౌద్ధాలయాలు
- శిఖరం లేని ఆలయం.. మద్ది క్షేత్రం
- జనాభా, ఓటర్లలోనూ అగ్రభాగం

చింతలపూడి:

ఏలూరు జిల్లాలో చింతలపూడి నియోజకవర్గానికి ప్రత్యేకత ఉంది. జిల్లాలోని మిగిలిన నియోజకవర్గాల కంటే జనాభా, ఓటర్లలో అగ్రభాగాన ఉంది. బ్రిటీష్ కాలానికి ముందునుంచి ఘన చరిత్ర కలిగిన నియోజకవర్గమిది. 500 ఏళ్ల క్రితం రెడ్డిరాజులు ఈ ప్రాంతాన్ని సుదీర్ఘకాలం పాలించారు. బౌద్ధులు, జైనులు ఈ ప్రాంతంలో నివసించిన ఆనవాళ్లు ఉన్నాయి. కామవరపుకోట మండలం జీలకర్రగూడెంలో వందల ఏళ్లక్రితం నాటి ప్రసిద్ధి చెందిన బౌద్ధ గుహలు మనకు దర్శనమిస్తాయి. చింతలపూడి నియోజకవర్గానికి తూర్పున పోలవరం నియోజకవర్గం, పశ్చిమాన కష్ణాజిల్లా తిరువూరు నియోజకవర్గం, ఉత్తరాన తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం, దక్షిణాన దెందులూరు నియోజకవర్గాలు సరిహద్దులుగా ఉన్నాయి. మొదట్లో చింతలపూడి, లింగపాలెం, కామవరపుకోట, టి.నరసాపురం మండలాలు కలుపుకుని నియోజకవర్గంగా ఏర్పడింది. 1983లో టీడీపీ ఆవిర్భావం తరువాత చింతలపూడి నియోజకవర్గం ఆ పార్టీకి కంచుకోటగా మారింది. తొలుత ఇండిపెండెంట్‌గా గెలిచిన కోటగిరి విద్యాధరరావు ఆ తరువాత టీడీపీలో చేరారు. ఆయన వరుసగా 5 సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. తరువాత 2004లో జరిగిన ఎన్నికల్లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభంజనంలో ఘంటా మురళీరామకృష్ణ కాంగ్రెస్ తరుపున పోటీ చేసి విద్యాధరరావుపై విజయం సాధించారు. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో టి నరసాపురం పోలవరం నియోజకవర్గంలో కలవగా, జంగారెడ్డిగూడెం మండలం చింతలపూడి నియోజకవర్గంలో విలీనమయ్యింది.

రాజకీయ నేపథ్యం

1952లో చింతలపూడి నియోజకవర్గం ఏర్పాటైంది. మొదటి ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థి ఎం కూనేరావు సమీప కాంగ్రెస్ అభ్యర్థి కేవీఎస్‌పీ రావుపై 7,341 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. 1962లో జరిగిన ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థి కోండ్రు సుబ్బారావుపై కాంగ్రెస్ అభ్యర్థి రేవులగడ్డ ఏసుపాదం 2,953 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. 1967లో ఇండిపెండెంట్ అభ్యర్థి ఐ పాపారావుపై కాంగ్రెస్ అభ్యర్థి గద్దే విష్ణుమూర్తి 10,825 ఓట్ల ఆధిక్యం సాధించారు. 1972లో కాంగ్రెస్ అభ్యర్థి దయాల ఇమ్మానియేలుపై ఇండిపెండెంట్ అభ్యర్థి దన్నపనేని కూనేరావు 4,975 ఓట్ల ఆధిక్యతతో గెలిచారు. 1978లో జనతాపార్టీ అభ్యర్థి మందలపు సత్యన్నారాయణపై ఇందిరా కాంగ్రెస్ అభ్యర్థి గద్దె వెంకటేశ్వరరావు 5,256 ఓట్ల ఆధిక్యతతో గెలిచారు.1983 వరకు కాంగ్రెస్, భారత కమ్యూనిస్ట్ పార్టీల మధ్య పోటీ నెలకొని ఉండేది. 83లో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తరువాత రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. కాంగ్రెస్ టీడీపీల మధ్య నువ్వా, నేనా అన్న రీతిలో ఎన్నికలు జరిగేవి. తెలుగుదేశం నుంచి కోటగిరి విద్యాధరరావు ఐదుసార్లు వరుసగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 10 సంవత్సరాల పాటు రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. 1983లో టీడీపీ అభ్యర్థి కేఎల్ఎస్ రాజుపై ఇండిపెండెంట్ అభ్యర్థి కోటగిరి విద్యాధరరావు 7,187 ఓట్ల ఆధిక్యతతో గెలిచారు. 1985, 1989, 1994 సంవత్సరాల్లో కాంగ్రెస్ అభ్యర్థి మందలపు సత్యన్నారాయణపై టీడీపీ అభ్యర్థి కోటగిరి విద్యాధరరావు విజయం సాధించారు. 1999లో కాంగ్రెస్ అభ్యర్థి మందలపు జమునారాణిపై టీడీపీ అభ్యర్థి కోటగిరి విద్యాధరరావు 31,890 ఓట్ల మెజార్టీతో గెలిచారు. 2004లో టీడీపీ అభ్యర్థి కోటగిరి విద్యాధరరావుపై కాంగ్రెస్ అభ్యర్థి ఘంటా మురళీరామకష్ణ 1,606 ఓట్ల ఆధిక్యతతో గెలిచారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో నియోజకవర్గం ఎస్సీలకు రిజర్వ్ అయ్యింది. 2009లో టీడీపీ అభ్యర్థి కర్రా రాజారావుపై కాంగ్రెస్ అభ్యర్థి మద్దాల రాజేష్‌కుమార్ 1,417 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. 2014లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి బూర్ల దేవీప్రియపై టీడీపీ అభ్యర్థి పీతల సుజాత 15,830 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఉన్నమట్ల ఎలీజా టీడీపీ అభ్యర్థి డా కర్రా రాజారావుపై 36,174 ఓట్ల భారీ ఆధిక్యతతో గెలుపొందారు.

ఓటర్ల వివరాలు

1952లో 71,734 మంది

ప్రస్తుతం నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,71,374

పురుషులు 1,33,512

మహిళలు 1,37,821

ఇతరులు 41





జగన్ పాలనలో సంక్షేమ ఫలాలు

పథకం	లబ్ధిదారులు	రూ.కోట్లలో
వైఎస్సార్ పింఛన్ కానుక	38,643	368.80
అమ్మ ఒడి	28,966	124.14
వైఎస్సార్ చేయూత	17,269	73.92
వైఎస్సార్ ఆసరా	5,962	265.62
వైఎస్సార్ రైతు భరోసా	45,313	201.31
వైఎస్సార్ సున్నా వడ్డీ	60,586	32.23
వైఎస్సార్ కాపు నేస్తం	3,294	13.12
ఉచిత పంటల బీమా	2,966	1.94
జగనన్న విద్యా దీవెన	14,656	43.72
జగనన్న వసతి దీవెన	11,312	15.79
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	2,409	6.58
వైఎస్సార్ బీమా	754	12.81
రైతు ఇన్‌పుట్ సబ్సిడీ	3,098	1.54
వైఎస్సార్ వాహన మిత్ర	1,520	5.54
సున్నా వడ్డీ పంట రుణాలు	10,753	5.39
జగనన్న చేదోడు	1,767	3.94
వైఎస్సార్ ఆరోగ్య శ్రీ	11,281	45.36
తెల్లరేషన్ కోవిడ్ సాయం	71,978	7.19
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	7,079	9.77
కల్యాణమస్తు	140	2.02
పాస్టర్లకు గౌరవ వేతనం	188	12.90

నాన్ డీబీటీ పథకాల లబ్ధి

పథకం	లబ్ధిదారులు	రూ.కోట్లలో
జగనన్న తోడు	7,881	16.65
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	10,930	25,34
జగనన్న గోరుముద్ద	15,552	15.49
జగనన్న విద్యా కానుక	18,190	10.45
ఇళ్ల స్థలాలు	12,000 మందికి	
భూ సేకరణ, స్థలాల అభివద్ధికి	రూ.10.83 కోట్లు మంజూరు	

ఇతర పథకాలు

- నాడు – నేడు ఫేజ్–1లో 92 పాఠశాలలు రూ.18.08 కోట్లు
- నాడు – నేడు ఫేజ్–2లో 163 పాఠశాలలు రూ. 60.49 కోట్లు
- రైతు భరోసా కేంద్రాలు 89 – రూ.17.22 కోట్లు
- సచివాలయాలు 89 – రూ. 35.6 కోట్లు
- విలేజ్ క్లినిక్స్ 61 – రూ.11.22 కోట్లు
- పంచాయతీరాజ్ శాఖలో సీసీ రోడ్లు 153 రూ.18.18 కోట్లు
- ఆర్అండ్‌బీ రోడ్లు 11 – రూ.58.89 కోట్లు
- సీసీ డ్రెయిన్లు 19 – రూ.3.73 కోట్లు
- తాగునీటి ప్రాజెక్టులు 145 – వ్యయం రూ.13.73 కోట్లు
- అంగన్‌వాడీ కేంద్రాలు 18 – రూ.2.75 కోట్లు
- డిజిటల్ లైబ్రరీలు 35 – వ్యయం రూ.6.8 కోట్లు
- బల్క్ మిల్క్ సెంటర్లు 25. – వ్యయం రూ.3.61 కోట్లు
- ఖమ్మం, దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి చింతలపూడి నియోజకవర్గం మీదుగా 4 లైన్ల రహదారి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అంచనా విలువ రూ.4.609 కోట్లు
- చింతలపూడి పట్టణంలో సుమారు రూ.25 కోట్ల వ్యయంతో 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయి.
- 16 కోట్ల జపాన్ బ్యాంక్ రుణంతో తమ్మిలేరు ప్రాజెక్టు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.
- జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయి పథకంలో 350 పనులు చేశారు. ఇందుకుగాను రూ. 21 కోట్లు ఖర్చు చేశారు.
- కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు 106 నిర్మించారు. రూ.3.18 కోట్లు వెచ్చించారు.
- ప్రధానమైన పంటలు: వరి, ఆయిల్‌పామ్, అరటి, మొక్కజొన్న, వేరుశనగ, మిర్చి, కొబ్బరి, పొగాకు, మామిడి, జీడిమామిడి పంటలు.

రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకే వేయాలి


వెలుతురువారిగూడెం సమీపంలో పిలక పొగాకు గ్రేడ్ చేస్తున్న అభ్యర్థులు రాజ్యలక్ష్మి, సునీల్‌కుమార్

బుట్టాయగూడెం: రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకే వేసి మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌యాదవ్ కోరారు. మంగళవారం వారు ఎమ్మెల్యే తెల్లం బాలరాజుతో కలిసి రెడ్డిగణపవరం, వాడపల్లి కాలనీ, వీరభద్రాపురం, వెలుతురువారిగూడెం, పాలకుంట, ములగలగూడెం, మెత్తప్పకోట, రేగులకుంట, రామారావుపేట సెంటర్, కర్రెడ్లగూడెం, జైనవారిగూడెం, మర్లగూడెం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, సయ్యద్ బాజీ, గగ్గులోతు మోహన్ రావు, జెడ్పీటీసీ మొడియం రామతులసి, సర్పంచ్‌లు తెల్లం జయమ్మ, తాతి సీత పాల్గొన్నారు.


వీరిశెట్టిగూడెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు


దళితులంతా సీఎం జగన్ వెంటే


కామవరపుకోట: వైఎస్ జగన్‌కు దళితులంతా అండగా ఉన్నారని పార్టీ చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. మంగళవారం వీరిశెట్టిగూడెం, వెంకటాపురం, రావికంపాడులో ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో చంద్రబాబు ఎస్సీల్లో పుట్టాలని ఎవరు కోరుకుంటారని దళితులను కించపరుస్తూ మాట్లాడారని, కానీ సీఎం జగన్ దళితుల శ్రేయస్సు కోరి, మేనిఫెస్టోలో 500 దళిత జనాభా కలిగిన గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేస్తాననడం హర్షణీయమన్నారు. మిడతా రమేష్ బాబు, కడిమి రమేష్, మేడవరపు అశోక్, కేసరి సరిత రెడ్డి, గోరుముచ్చు గోపాల్ యాదవ్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయం తథ్యం


ఐఎస్ రామానుజాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి తానేటి వనిత

ద్వారకాతిరుమల: ప్రతిపక్షాలు ఎన్ని జిమ్మిక్కులు చేసినా వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని రాష్ట్ర హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత అన్నారు. మండలంలోని ఐఎస్ జగన్నాథపురం, ఐఎస్ రాఘవాపురం, ఐఎస్ రామానుజాపురం, లక్ష్మీపురం, గొడుగుపేట, జి.కొత్తపల్లి, కొత్తగూడెం, రామసింగవరం గ్రామాల్లో మంగళవారం ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ముందుగా ఆమె ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై కొలువైన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి ఆలయాన్ని సందర్శించి, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ మాయమాటలతో ప్రజలను వంచించడానికే టీడీపీ, జనసేన, బీజేపీలు కూటమిగా ఏర్పడ్డాయన్నారు. కూటమి మాటలను ప్రజలు నమ్మవద్దని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ జగనన్న సీఎం కావాలన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను, రాజమండ్రి ఎంపీగా గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, ఎంపీపీ బొండాడ మోహిని, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, సర్పంచ్‌లు పసుపులేటి ఏసుబాబు, దాకారపు బంగారమ్మ, చెలికాని ప్రవీణ్, పోల్కంపల్లి అనీల్, చెలికాని సంజయ్, బుల్లియ్య తదితరులున్నారు.


జంగారెడ్డిగూడెంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం


చింతలపూడి వైఎస్సార్ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు


ప్రగడవరం పంచాయతీ శంఖుచక్రపురంలో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

ఉత్సాహంగా వైఎస్సార్ సీపీ ప్రచారం

జంగారెడ్డిగూడెం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. జంగారెడ్డిగూడెం 11వ వార్డులో వైఎస్సార్‌సీపీ గడపగడపకు ఎన్నికల ప్రచారం మంగళవారం నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు చిటికెల అచ్యుత రామయ్య ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పట్టణంలో జరిగిన అభివృద్ధిని వివరించి ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని కోరారు.

చింతలపూడి: వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ చింతలపూడి నగర పంచాయతీలోని వైఎస్సార్ కాలనీలో ఆ పార్టీ శ్రేణులు మంగళవారం ప్రచారం నిర్వహించారు. అలాగే ప్రగడవరం పంచాయతీ శంఖు చక్రపురంలో సర్పంచ్ టి భూపతి, ఉప సర్పంచ్ ఎస్ రమేష్‌రెడ్డిల నేతృత్వంలో పార్టీ శ్రేణులు ప్రచారం చేశారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము - దేవదాయ ధర్మదాయ శాఖ
గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం
జంగారెడ్డిగూడెం పట్టణం & మండలం, ఏలూరు జిల్లా.

కొటేషన్లు కొరకు ప్రకటన

[illegible]

వ.నెం.	టెండరు వివరము	పని పూర్తి చేయు కాలము	ధరావత్తు (రూ.)	షెడ్యూల్ వెల (రూ.)
1.	[illegible]	5 రోజులు	5,000/-	500/-

[illegible]

కార్యనిర్వహణాధికారి
గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం
జంగారెడ్డిగూడెం

తేది : 30.04.2024
స్థలం : జంగారెడ్డిగూడెం